RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 295 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 31-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 295 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 31-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS



## నేడే చంద్రన్న జలజాతర..

# వెలుగొండకు కృష్ణమ్మ పరుగులు..




**మార్కాపురం, సిటిజన్ టైమ్స్**

కరువు నేల కన్నీరు తుడవనున్న చారిత్రక ఘట్టానికి మార్కాపురం సర్వం సిద్ధమైంది. దశాబ్దాల కల... పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు కృష్ణా జలాలతో జలహారతి ఇవ్వనున్నారు. నాగార్జునసాగర్ నుండి 10.6 టీఎంసీల జలాలను విడుదల చేయనున్నారు.

**1996లో పునాది.. 2026లో ప్రారంభం..**

1996 మార్చి 5న ఈ మహా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నేత చంద్రబాబే, మూడు దశాబ్దాల తర్వాత దీన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్న నేత కూడా ఆయనే కావడం చరిత్ర. మధ్యలో వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం వచ్చాక రెండేళ్లలో రూ.2400 కోట్లు వెచ్చించి, ఫీడర్ కెనాల్ కు మరో రూ.485 కోట్లతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది.

**4.32 లక్షల ఎకరాలకు సాగు.. 20 లక్షల మందికి తాగునీరు..**

వెలుగొండ పూర్తితో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 32 మండలాల రూపురేఖలు మారనున్నాయి. 4.32 లక్షల ఎకరాలకు సాగునీరు, 20 లక్షల మందికి పైగా తాగునీరు అందనుంది. ఎల్ నినోతో వర్షాలు తగ్గిన వేళ ఈ 10.6 టీఎంసీలతో భూగర్భ జలాలు పెరిగి, బోర్లలో నీళ్లు పుష్కలంగా రానున్నాయి.

**నిర్వాసితుల త్యాగానికి పెద్దపీట..**

ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ప్రభుత్వం మరవలేదు. కేవలం 40 రోజుల్లోనే రూ.800 కోట్లకు పైగా ఆర్‌డఆర్ ప్యాకేజీ మంజూరు చేసింది. ఇప్పటివరకు 7027 కుటుంబాలకు రూ.905 కోట్లు అందించింది.

**చట్టంలో లేకపోయినా.. యువతకు రూ.2 లక్షలు..**

2013 భూ సేకరణ చట్టంలో లేకపోయినా మానవతా దృక్పథంతో సీఎం చంద్రబాబు మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2019 కటాఫ్ తర్వాత 2026 నాటికి 18 ఏళ్లు నిండిన నిర్వాసిత యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. దీని కోసం అదనంగా రూ.169 కోట్లు కేటాయించారు.

**అన్ని సౌకర్యాలు సిద్ధం.. పండుగ వాతావరణంలో మార్కాపురం..**

ముంపు గ్రామాల ప్రజలకు నెల రోజుల రేషన్ కిట్, నివాసం లేని వారికి ప్రభుత్వ షెల్టర్లు సిద్ధం చేశారు. చివరి నిర్వాసితుడికి న్యాయం చేసే వరకు ప్రక్రియ కొనసాగుతుందని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. సీఎం పర్యటనతో మార్కాపురం జిల్లా అంతటా పండుగ వాతావరణం నెలకొంది.



# కొరిశపాడు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన కమిటీల ఎన్నిక

## అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు, ఘనంగా ర్యాలీ




అద్దంకి, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30

కొరిశపాడు మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన మండల కమిటీల ఎన్నిక సమావేశం ఉత్సాహంగా జరిగింది. సమావేశానికి ముందు డప్పులు, టపాకాయలతో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేశారు. అద్దంకి నియోజకవర్గ ఎంఎస్‌పీ ఇన్‌ఛార్జ్ తేళ్ల. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సొట్ట నరేంద్రబాబు మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 32 ఏళ్లుగా అణగారిన వర్గాల కోసం ఎంఆర్‌పీఎస్ చేస్తున్న పోరాటాలను వివరించారు. పేద వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ఎంఎస్‌పీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.? అనంతరం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**ఎంఆర్‌పీఎస్ మండల కమిటీ:**

అధ్యక్షుడిగా తేళ్ల. ప్రసాద్, అధికార ప్రతినిధిగా పాలపర్తి. కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఆలూరి. అఖిల్, ఉపాధ్యక్షులుగా మంద. అర్జున్, కప్పల. మురళి, కార్యదర్శిగా మంద.రాజుతో పాటు మరో 11 మంది ఎన్నికయ్యారు.

**ఎంఎస్‌పీ మండల కమిటీ:**

అధ్యక్షుడిగా పాలపర్తి. సురేష్, అధికార ప్రతినిధిగా దంతం. శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అట్లూరి. రవికుమార్, ఉపాధ్యక్షులుగా మున్నంగి. సంతోష్‌రావు, పాలపర్తి. పాపారావు, కార్యదర్శులుగా కొలకలూరి. సుఖర్ణ, ఉసిరిపాటి. రాఘవయ్యతో పాటు మరో 10 మంది ఎన్నికయ్యారు. ?ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పాలడుగు. రమేష్ మాల, ఎంఈఎఫ్ సీనియర్ నాయకులు ఎల్‌ఐసీ ప్రసాద్, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు రమేష్, గ్రామ కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పహారాలో సీపీఎం కార్యాలయం... ఉదయం 5 నుండే నేతల నిర్బంధం

### సీఎం పర్యటన వేళ కమ్యూనిస్టుల హౌస్ అరెస్ట్

### కార్యాలయంలోనే పోలీసుల మోహరింపు

### కూటమి సర్కార్ తీరుపై ప్రజా సంఘాల ఆగ్రహం




మార్కాపురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30

వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాక సందర్భంగా మార్కాపురం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయం పోలీస్ పహారాలోకి వెళ్లింది. ఈరోజు ఉదయం 5 గంటల నుండే సీపీఎం నేతలను పోలీసులు నిర్బంధించారు. కార్యాలయం లోపలే ఇద్దరు పోలీసులు బల్లలు వేసుకుని కూర్చోవడంతో ఉద్రిక్తత నెలకొంది.వెలుగొండ ప్రాజెక్టు పనులు తమ పోరాటాలతోనే ముందుకు సాగాయని, 30 ఏళ్లుగా పాలక పార్టీలు నాన్చాయని సీపీఎం నేతలు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టు కోసం, నిర్వాసితుల కోసం కేసులు, జైళ్లకు వెరవకుండా అనేక ఉద్యమాలు నడిపామని, నేడు సీఎం వస్తున్న వేళ తమ గొంతు నొక్కేందుకు నిర్బంధిస్తున్నారని మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వ చర్యలపై ప్రజా సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

# 30 ఏళ్ల ప్రజల కల నేడు సాకారం దిశగా 'వెలుగొండ'

### జయప్రదం చేయాలని టీడీపీ ఇంచార్జి ఎరిక్షన్ బాబు పిలుపు.



(యర్రగొండపాలెం :సిటిజన్ టైమ్స్, ఆగస్టు 30)

వెలుగొండ జలప్రదత, ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేడు శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి, నీటిని విడుదల చేసి జాతికి అంకితం చేయనున్న నేపథ్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని రైతులు, యువత, ప్రజలు, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు లక్షలాదిగా తరలి వచ్చి ముఖ్యమంత్రి వెలిగొండ ప్రాజెక్ట్ పర్యటనను విజయవంతం చేయాలని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి ఎరిక్షన్ బాబు ఒక ప్రకటనలో కోరారు.

# ముప్పయ్యేళ్ల కల సాకారం

## సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

## బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి

మార్కాపురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30

ముప్పయ్యేళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమవుతున్న శుభసందర్భంగా బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం లాంఛనంగా జరుగుతున్న సందర్భంగా ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమని, మూడు దశాబ్దాలుగా సాగిన నిరీక్షణకు నేడు ముగింపు పలుకుతూ ఆ కల సాకారమవుతున్న చారిత్రాత్మక ఘట్టమని ఏలూరి పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తితో మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల పరిధిలోని రైతులకు సాగునీటి భరోసా కలగడంతో పాటు వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని ఆయన అన్నారు.ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ప్రజలు, రైతులు, రైతు కూలీలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే సభను విజయవంతం చేయాలని ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని.. ఈ ప్రాంత ప్రజల ఆశలు, ఆకాంక్షలు, భవిష్యత్తుకు ప్రతీకగా నిలిచే కలల సౌధం అని ఆయన పేర్కొన్నారు.



# సీఎం పర్యటన వాహనాల మళ్లింపు

### ఉదయం 5 నుండి మధ్యాహ్నం 3 వరకు ఆంక్షలు

### ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని డి.ఎస్.పి సూచన




మార్కాపురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30

సీఎం నారా చంద్రబాబు నాయుడు పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు సందర్శన నేపథ్యంలో మార్కాపురం జిల్లాలో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించినట్లు డీఎస్పీ యు. నాగరాజు తెలిపారు. 31వ తేదీ ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు. గుంటూరు వైపు నుండి ఆత్మకూరు వెళ్లే వాహనాలు గిద్దలూరు మీదుగా నంద్యాలకు వెళ్లి అక్కడి నుండి ఆత్మకూరు చేరుకోవాలని సూచించారు. అలాగే ఆత్మకూరు నుండి గుంటూరు లేదా శ్రీశైలం వైపు వెళ్లే వాహనాలు కూడా నంద్యాల నుండి గిద్దలూరు మీదుగా వెళ్లాలన్నారు. దేవరాజుగట్టు నుండి చిన్నదోర్నాల వైపు వెళ్లే దారిని పూర్తిగా మూసివేసినట్లు తెలిపారు. శ్రీశైలం వచ్చే, వెళ్లే వాహనాలు దోర్నాల పట్టణంలోకి ప్రవేశించకుండా పక్కదారి నుండి వెళ్లాలని, ఆత్మకూరు వెళ్లేవారు గిద్దలూరు మీదుగా వెళ్లాలని డీఎస్పీ కోరారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# వెలుగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

### టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్

(పుల్లలచెరువు, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 30)

శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ నేడు సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా అందరు కలిసి వచ్చి జలహారతి లో పాల్గొనాలని ఆయన కోరారు.ఈ వెలుగొండ ప్రాజెక్ట్ ను గత 30 ఏళ్ల నాటి కలను ఈనాటికి సాకారం చేస్తున్న తరుణంలో ప్రజలు తరలివచ్చి జలహారితి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.



# నారాయణ స్వామికి భక్తిశ్రద్ధలతో అభిషేకం, గోపూజ ,మహా నైవేద్యం



సి ఎస్ పురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.నారాయణస్వామికి ప్రీతికరమైన రోజుగా భావించే ఆదివారం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయాలను అనుసరించి శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం స్వామివారి మూలవిరాట్ పాటు శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పమాలలతో అలంకరించారు. వివిధ రకాల పూలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం గోశాలలో గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు తదుపరి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించారు మేళతాళాల వేదమంత్రోత్సవాల్లో భక్తుల నారాయణస్వామి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక




మార్కాపురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30

పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్ లో గల తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తాతపూడి సామ్యూల్ జైపాల్, ఉపాధ్యక్షులుగా కట్టే బెనహ రవికుమార్, కార్యదర్శిగా సంద్రపాటి ప్రభుదాస్, కోశాధికారిగా కోలా రఘుబాబు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా లింగాల అబ్రహం, పెద్ద పోగు విజయకుమార్, పుప్పాల శ్యామ్, ఆదిమూలపు సరోజ్ కుమార్, కె. సంజీవ్, ఆదిమూలపు నీలిమ, శ్రీరామ్ లావణ్య ఉన్నారు. యూత్ డైరెక్టర్ గా దారి వేముల హర్షిత బాబి, సండే స్కూల్ సూపరింటెండెంట్ గా డి. సువర్ణ, వీబీఎస్ డైరెక్టర్ గా హథసాయంజల్, స్త్రీల సమాజం అధ్యక్షురాలిగా చిట్టెం సాయి లీలావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నూతన కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగనుంది.

# మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన మాదినేని లక్ష్మణ్

సి ఎస్ పురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30

రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి వి మాధవ్ పిలుపుమేరకు, జిల్లా బిజెపి అధ్యక్షులు పి వి కృష్ణారావు ఆదేశాలతో మండల కేంద్రం సి ఎస్ పురం స్వగృహం నందు ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మాదినేని లక్ష్మణ్ వీక్షించారు.ఈ సందర్భంగా మాదినేని లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' ద్వారా దేశ ప్రజలతో నేరుగా మమేకమవుతూ దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసేవా కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. దేశ ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రధాని నరేంద్ర మోదీ కి అండగా ఉంటూ ప్రతి ఒక్కరూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.



# డిప్యూటీ చైర్మన్ తూమాటికి ఘన సన్మానం

**-జగనన్నను నమ్మితే న్యాయం జరుగుతుంది**

**-తూమాటి అదృష్టవంతుడు**

**-స్థానిక సంస్థల ఎన్నికలకు మేము సిద్ధం**

**-బుర్రా మధుసూదన్ యాదవ్**

**-భారీగా హాజరైన వైకాపా శ్రేణులు**







**కందుకూరు, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30**

కందుకూరు వైఎస్ఆర్సీపీ ఇంఛార్జి,మాజీ శాసన సభ్యులు బుర్రా మధుసూధన్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజక వర్గం పార్టీ కార్యాలయం లో బుర్రా చేతుల మీదగా శాసన మండలి ఉప సభాపతి గా నియమితులైన తూమాటి మాధవరావు కి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి వైకాపా కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బుర్రా మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ పార్టీ ని బలోపేతం చెయ్యడానికి కృషి చేసే క్రమశిక్షణ, నిబద్ధత, అంకిత భావం ఉన్న నాయకులను జగన్ మోహన్ రెడ్డి ఆదరించి పార్టీ లో తగిన గుర్తింపు ఇస్తాడు అనడానికి నిదర్శనం తూమాటి మాధవరావు ను చూస్తే అర్థమవుతుందని కొనియాడారు.నామీద నమ్మకం తో జగన్ మోహన్ రెడ్డి నన్ను కందుకూరు పంపించారు. వైసిపి కమ్మ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని అనడం తూమాటి డిప్యూటీ చైర్మన్ పదవి అలంకరించడమే అని అన్నారు. వైసిపి కులాలకు మతాలకు అతీతంగా కష్టపడిన వారికి గుర్తింపుని ఇచ్చే పార్టీ అని అన్నారు. జగన్ నమ్మినవారు ఎవ్వరు కూడా మోసపోలేదని గుర్తు చేశారు. 2029లో వైసిపి భారీ మెజార్టీతో గెలుస్తుందని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అందరం సమిష్టిగా కృషి చేసి మిమ్మల్ని అందరినీ గెలిపిపించి జగన్ మోహన్ రెడ్డి బహుమతి గా ఇవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతే కాకుండా నాయకులకు, కార్యకర్తలకు ధైర్యాన్ని, భరోసాను కలుగ జేశారు. టిడిపి పోలీసులు గూండాయిజం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు రావాలని వైసిపి ఖచ్చితంగా మెజార్టీ స్థానాలు గెలుస్తుందని అన్నారు. స్థానిక సంస్థలలో 92 పంచాయతీలలో అభ్యర్థులను నిలబెడతామని వారందరికీ నేను అండగా ఉంటారని అన్ని విధాల ఆదుకుంటానని అన్నారు. అన్ని మండలాలలో గెలిచి జగనన్నకు గిఫ్టుగా ఇద్దామని అన్నారు. ఇప్పటివరకు కందుకూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ వైసీపీ ఏడుసార్లు గెలవగా, టిడిపి కేవలం మూడుసార్లు గెలిచిందని గుర్తు చేశారు. మీరు గెలిస్తే నేను గెలుస్తానని కావున అందరూ కలిసిమెలిసి పనిచేయాలని పనిచేసే వారికి పెద్దపేట వేస్తామని అన్నారు.

శాసన మండలి ఉప సభాపతి తూమాటి మాధవరావు మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం కృషి చేశానని,జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రను విజయవంతం గా నిర్వర్తించడం వల్ల,నేను వైఎస్ఆర్సీపీ కార్యకర్తగా బాగా గుర్తుండి పోయానని గుర్తు చేసుకున్నారు.

నన్ను గౌరవించి, ఒక్క పిలుపుతో అన్ని మండలాల నుండి వచ్చిన వైఎస్ఆర్సీపీ నాయకులకు,కార్యకర్తలకు ఋణ పడి ఉంటానని,బుర్ర మధుసూధన్ యాదవ్ ఈసందర్భంగా తెలియ జేశారు. అనంతరం తూమాటి మాధవరావును నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు తోకల కొండయ్య చీమల వెంకట రాజా గంగిరెడ్డి షేక్. రఫీ, ఈదర రమేష్, అనుమోలు లక్ష్మీనరసింహం, పెన్నా కృష్ణయ్య , నోటి వేంకటేశ్వర రెడ్డి, ఆవుల మాధవరావు, ఉప్పుటూరి నాగేశ్వరరావు, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, చింతలపూడి రవీంద్ర,పులి రమేష్, పెన్నా కృష్ణయ్య, బద్దిపూడి జయరావు, అప్పనబోయిన రాజేష్, షేక్ రహీం, కట్టా హనుమంతరావు, చంద్రమౌళి, గుత్తా గోపి, రావులకోల్లు బ్రహ్మానందం, పల్నాటి చెన్నయ్య, వల్లూరి కోటేశ్వరరావు, రమేష్ యాదవ్, బిల్లా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుకా మావూళ్ళమ్మ తల్లిని దర్శించుకున్న దివి రవీంద్రనాథ్





**కందుకూరు, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30**

పట్టణంలోని తూర్పు వడ్డెపాలెం (12వ వార్డు) నందు నూతనంగా నిర్మించిన శ్రీ రేణుకా మాఊళ్ళమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీ నాయకులు దివి రవీంద్రనాథ్ ను కలిసి శ్రీ రేణుకా మాఊళ్ళమ్మ తల్లి ఆలయానికి రావాలని ఆహ్వానం పలికారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు దివి రవీంద్రనాథ్ ఆదివారం శ్రీ రేణుక మాఊళ్ళమ్మ తల్లి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివి రవీంద్రనాథ్ ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. రవీంద్రనాథ్ వెంట ఆలయ కమిటీ సభ్యులు కుంచాల శ్రీనివాసరావు, కుంచాల వెంకటరమణ, కుంచాల సురేష్, కుంచాల మురళి బాబు, కుంచాల భాస్కర్, కుంచాల బాలమురళి, కుంచాల మాధవ, కుంచాల శ్రీను తదితరులు ఉన్నారు.

## వెలిగొండ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

**రైతుల కల సాకారమవుతోందన్న నేతలు**





**మార్కాపురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30**

కరువు నేలకు కృష్ణమ్మ పారనున్న చారిత్రాత్మక ఘట్టానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరిగాయి. దశాబ్దాల రైతుల కలను సాకారం చేస్తూ నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరగనున్న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేడుకల ఏర్పాట్లను నాయకులు పరిశీలించారు.మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన జిల్లా నాయకులు ఇమ్మడి కాశీనాథ్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు వేదిక, హెలిప్యాడ్, సభా ప్రాంగణం తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు రానున్నాయని అన్నారు. రేపు జరిగే ప్రారంభోత్సవానికి రైతులు, ప్రజలు ఊరు వాడ కదలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు ఆద్యుడు ఎర్ర దొర పూల సుబ్బయ్య

**త్రాగు నీరు సాగు నీరు కోసం చేసిన ఉద్యమమే వెలుగొండకు పూల సుబ్బయ్య పేరు**

**యర్రగొండపాలెం**

**సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30**



పూల సుబ్బయ్య ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గొప్ప కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు, న్యాయవాది,మాజీ శాసనసభ్యులు,పలక కార్మికుల గుండెల్లో గూడై నిలిచి పశ్చిమప్రాంత ప్రజలతో ఎర్ర దొర అని పిలిపించుకున్న పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ఉద్యమానికి ఆద్యుడు ఆయనే. ముప్పై ఏళ్ల కలల సాకారం అయిన వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా పెన్ పవర్ ప్రత్యేక కథనం.పూల సుబ్బయ్య 1929జూన్ 29న ప్రకాశంజిల్లా లోని కంభం గ్రామంలో సామాన్య కుటుంభం లో జన్మించారు. చిన్న తనంలోనే తండ్రిని కోల్పోయి తల్లి ప్రోత్సాహంతో డిగ్రీ పూర్తి చేసి బెల్గాంలో న్యాయవిద్య అభ్యసించి, మార్కాపురంలో న్యాయవాదిగా ఉంటు పేద ప్రజల తరుపున ఉచితంగా కేసులు వాదిస్తూ వారి నమ్మకాన్ని గెలుచుకున్నారు.కమ్యూనిస్ట్ భావజాలనికి ఆఖర్శిశీతుడై కమ్యూనిస్టు పార్టీలో చేరి బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం అనేక పోరాటాలు చేశారు.1962,1967లలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో యర్రగొండపాలెం నుండి రెండు సార్లు , 1978 శాసనసభ ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా ఎన్నికయ్యారు.

**కరువును తరిమెందుకు వెలుగొండ కోసం ఉద్యమం**

పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని కరువు ఫ్లోరైడ్ రక్కసి నుండి రక్షించడానికి కృష్ణ జలాలను ఈ ప్రాంతానికి తరలించాలని ఆయన తీవ్రంగా పోరాడారు.శాసనసభలోను వెలుపల కరువు ప్రాంతాల నీటి సమస్యలపై నిరంతరం గళమెత్తారు.త్రాగు నీరు, సాగు నీరు సౌకర్యం లేక అల్లాడుతున్న ప్రాంతాలలో పర్యటించి రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిపారు.పూల సుబ్బయ్య కృషి ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వెలుగొండ కోసం కమిటీని ఏర్పాటు చేయడం విశేషం.ఆ తర్వాత 1996లో ముఖ్యమంత్రి గా ఉన్న నారా చంద్రబాబు నాయుడు గొట్టిపడియ వద్ద వెలుగొండకు శంకుస్థాపన చేసినసాంకేతిక కారణాలవల్ల పనులు ముందుకు జరగలేదు. 2001లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హయాంలో ముఖ్యమంత్రి వై యస్ రాజశేఖరరెడ్డి గొట్టిపడియ వద్ద శంకుస్థాపన చేసి వెలుగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశారు.ఈ ప్రాజెక్టు ఆవశ్యకత ను తెరపైకి తెచ్చి అహర్నిశలు పోరాడిన పూల సుబ్బయ్య పేరును వెలుగొండ ప్రాజెక్టు కు పెట్టాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేయగా వై యస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టు కు పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు అని పేరు పెట్టడం విశేషం.పూల సుబ్బయ్య ఆలోచనవిధానం, ఉద్యమ ఫలితం ముప్పై ఏళ్ల తర్వాత కల సాకారం కాబోతున్న వేళ పూల సుబ్బయ్య కు నిజమైన నివాళులు అర్పించక తప్పదు.

# వెలుగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి -బొబ్బూరి రమేష్

**సి ఎస్ పురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేడు మార్కాపురం లో జరగనున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ పిలుపునిచ్చారు. కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రంలోని సి ఎస్ పురం టిడిపి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం అవుతోందన్నారు. 1996లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును మూడు దశాబ్దాల అనంతరం ఆయన చేతుల మీదుగానే ప్రారంభించడం చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. కరువు ప్రాంతాలకు కృష్ణా జలాలు అందుబాటులోకి రానుండటం రైతాంగానికి ఎంతో ప్రయోజనకరమన్నారు. వెలుగొండ జలాలతో మన ప్రాంత ప్రజలకు సాగునీటి సమస్యకు ఉపశమనం లభించడంతోపాటు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు ప్రారంభోత్సవ కార్యక్రమానికి టిడిపి నాయకులు ఎన్డిఏ కూటమి నాయకులను కలుపుకొని గ్రామాల వారిగా ప్రజలను రైతులను ప్రజలను సమీకరించి మార్కాపురం వెలుగొండ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, మన్నేపల్లి కార్తీక్, అట్లూరి రామకృష్ణంరాజు, కోనంగి వెంకట కొండయ్య, పునుగుపాటి రవికుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, బత్తుల వెంకటాద్రి , గ్రామ టిడిపి అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ యూనిట్ ఇన్చార్జీలు, టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు వెలిగొండ జలాలతో సాగునీటి సమస్యకు ఉపశమనం లభించడంతో పాటు తాగునీటి సమస్యలు కూడా పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. మార్కాపురం ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని రైతులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# అంభాపురంలో భూవివాదం

**టీడీపీ--వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ**





**కొనకనమిట్ల, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30**

కొనకనమిట్ల మండలంలోని వాగుమడుగు పంచాయతీ పరిధిలోని అంబాపురం గ్రామంలో ఆదివారం భూవివాదం ఉద్రిక్తతకు దారితీసింది.అన్నదమ్ముల మధ్య తలెత్తిన స్థల వివాదం కాస్తా టీడీపీ-వైసీపీ వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది.స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా పరిస్థితి అదుపుతప్పి పరస్పరం కర్రలు,రాళ్లతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు.ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు,స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఈ ఘర్షణలో టీడీపీకి చెందిన ఇద్దరికి,వైసీపీకి చెందిన నలుగురికి గాయాలైనట్లు సమాచారం.ఘటన కు సంబంధించి ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం.

# రోడ్డు ప్రమాదంలో నల్లమడుగుల వాసి మృతి

**సి ఎస్ పురం, సిటిజెన్ టైమ్స్, ఆగస్టు 30**

మండలంలోని నల్లమడుగుల గ్రామానికి చెందిన గుడిగుంట్ల నారాయణ పనుల నిమిత్తం పోరుమామిళ్లకు వెళ్తుండగా ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. సీతారాంపురం చెకోపోస్టు సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకున్నప్పటికీ అప్పటికే నారాయణ మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనతో నల్లమడుగుల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఇమేజ్ ను పక్కనబెడితే కనక వర్షమే!

ఒకప్పుడు సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాలంటే భారీ బడ్జెట్లు, వందల కోట్ల వ్యయంతో కూడిన విజువల్ ఎఫెక్ట్స్, స్టార్ హీరోల ఇమేజ్ మాత్రమే సరిపోతాయని భావించేవారు. కానీ కాలం మారుతున్న కొద్దీ ప్రేక్షకుల అభిరు చి కూడా మారుతోంది. ప్రస్తుతం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడానికి భారీ హంగులు మాత్రమే సరిపోవని, తెరపై కనిపించే కథలో బలం ఉండాలని చిత్ర పరిశ్రమ స్పష్టంగా గ్రహిస్తోంది. ఈ కొత్త ట్రెండ్‌కు నిదర్శనంగా ఇటీవలి కాలంలో వచ్చిన అనేక సినిమాలు నిలుస్తున్నాయి. స్టార్ ఇమేజ్‌ను నమ్ముకోకుండా విభిన్నమైన కథాంశాలతో వస్తోన్న చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద భారీ ఆదరణ లభిస్తోంది.





సమంత ప్రధాన పాత్రలో రిలీజ్ అయిన –మా ఇంటి బంగారం–, అఖిల్ అక్కినేని నటించి –లెనిన్–, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన –కొరియన్ కనకరాజు–, మాస్ మహారాజా రవితేజ తాజా చిత్రం –ఇరుముడి– వంటి ప్రాజెక్ట్‌లు కొత్త కోణానికి అద్దం పడుతున్నాయి. ఈ చిత్రాలన్నీ సాధారణ ఇమేజ్ హంగులకు దూరంగా పూర్తిగా కంటెంట్ ... పాత్రల చుట్టూ తిరిగే కథాంశాలతో రూపుదిద్దుకున్నాయి. స్టార్ హీరోల ఇమేజ్, భారీ మార్కెట్ సమీకరణాలను పక్కన పెట్టి దర్శకుని విజన్‌ను నమ్మి చేసిన చిత్రాలివి. ప్రేక్షకులు కూడా రొటీన్ కమర్షియల్ ఫార్ములాను పక్కన పెట్టి కొత్తదనం ఉన్న కథలను ఎప్పుడూ ఆదరిస్తారని ఈ చిత్రాల ఫలితాలో మరోసారి నిరూపితమవుతోంది. ఇతర భాషల ప్రేక్షకులు సైతం బలమైన కంటెంట్ ఉన్న తెలుగు చిత్రాలకు బ్రహ్మరథం పడుతున్నారని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. భాషా భేదాలతో సంబంధం లేకుండా ఎమోషనల్ కనెక్ట్ ఉన్న సినిమాలను గ్లోబల్ ఆడియన్స్ రిసీవ్ చేసుకుంటున్న తీరు అద్భుతంగా ఉంది. దీంతో నిర్మాతలు కూడా భారీ బడ్జెట్ రిస్క్‌ల కంటే కంటెంట్ బేస్డ్ సినిమాల వైపు మొగ్గు చూపడానికి ఆసక్తిగా ఉన్నారు. ఇది తెలుగు పరిశ్రమ పరిధిని మరింత విస్తృతం చేస్తోంది. నటీనటులు కూడా రెగ్యులర్ ఇమేజ్ ట్రాప్ నుంచి బయటపడి విలక్షణమైన పాత్రలు చేయడానికి ఈ ట్రెండ్ ఎంతగానో దోహదపడుతోంది. ప్రయోగాత్మక చిత్రాలు సైతం కమర్షియల్‌గా మంచి విజయాలను నమోదు చేయొచ్చు ని నిరూపితమవుతుండటంతో దర్శక నిర్మాతల్లో కొత్త ఉత్సాహం వెల్లువెత్తుతోంది. భవిష్యత్ లో కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాల హవా మరింత ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి ఇమేజ్ కంటే కంటెంటే రాజు అనే నిజాన్ని టాలీవుడ్ మరోసారి బలంగా చాటి చెబుతోంది. భారీ బడ్జెట్ల ప్రయోగాలు విఫలమైన చోట బలమైన కథాంశాలు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఈ సరికొత్త ధోరణి ఇండియన్ సినిమా స్థాయిని మరింత పెంచి భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలు రావడానికి బాటలు వేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.



మృణాల్ ఠాకూర్ ఆకర్షణీయమైన ఎరుపు రంగు క్రాప్ టాప్ మరియు గులాబీ రంగు స్కర్ట్‌లో

### ఆ కోచ్ లు విషపూరితం.. బాబర్ వైఫల్యాలకు వారే కారణం:

## పాక్ మాజీ క్రికెటర్ యూసుఫ్ మండిపాటు



- బాబర్ అజామ్ ఫామ్ కోల్పోవడానికి కోచ్‌లే కారణమన్న మహ్మద్ యూసుఫ్
- జట్టులోని కొందరు కోచ్‌లు ఆటకు విషం లాంటివారని తీవ్ర విమర్శలు
- 2022 డిసెంబర్ నుంచి టెస్టుల్లో సెంచరీ చేయలేకపోయిన బాబర్
- ఆటగాళ్ల టెక్నిక్‌లోని లోపాలను సరిదిద్దడంలో కోచ్‌లు విఫలమయ్యారని ఆరోపణ
- ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లోనూ పాకిస్థాన్ పేలవ ప్రదర్శన

పాకిస్థాన్ టెస్ట్ కెప్టెన్ బాబర్ అజామ్ సుదీర్ఘకాలంగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటంపై ఆ దేశ మాజీ క్రికెటర్ మహ్మద్ యూసుఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. బాబర్ ఫామ్ కోల్పోవడానికి, అతని టెక్నిక్‌లోని లోపాలను సరిదిద్దుకోలేకపోవ డానికి జట్టులోని 'కొందరు కోచ్‌లే' కారణమంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. వారిని "ఆటకు విషం లాంటి వారు" అని అభివర్ణిస్తూ సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బాబర్ అజామ్ ఔటైన తీరును కామెంటేటర్ నాసిర్ హుస్సేన్ విశ్లేషించిన వీడియోను షేర్ చేస్తూ మహ్మద్ యూసుఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "కొన్నేళ్ల క్రితమే నేను ఈ విషయంపై హెచ్చరించాను. కానీ, బాబర్ చుట్టూ ఉన్న కొందరు నాసిరకం కోచ్‌లు అతనిలోని లోపాలను సరిదిద్దుకోవడానికి అనుమతించలేదు. సులభంగా పరిష్కరించగల సమస్యను కూడా వారు పట్టించుకోలేదు. ఆ వైఫల్యమే ఇప్పుడు పాకిస్థాన్ క్రికెట్‌ను ఈ పతనానికి లాగింది" అని యూసుఫ్ ఎక్స్‌లో పేర్కొన్నాడు.

"ఈ కోచ్‌లు ఆట పట్ల విషపూరితమైన వారు. వారికి విజన్ లేదు, పురోగతిని అడ్డుకుంటారు, ప్రతిభావంతులైన ఆటగాళ్లను తప్పుదోవ పట్టిస్తారు. మన క్రికెటర్లు ఎవరి మాట వినాలో నేర్చుకోకపోతే వారి కెరీర్లు అనుకున్నదానికంటే ముందే ముగుస్తాయి. మన ఆటగాళ్ల బలహీనమైన టెక్నిక్ ఇప్పుడు బంగ్లాదేశ్ నుంచి ఇంగ్లండ్ వరకు బట్టబయలైంది" అని మండిపడ్డాడు. 2022 డిసెంబర్ తర్వాత బాబర్ అజామ్ ఇప్పటివరకు టెస్టుల్లో శతకం నమోదు చేయలేదు. అనేకసార్లు సెంచరీకి చేరువగా వచ్చినప్పటికీ విఫలమయ్యాడు. అతని ఫామ్‌తో పాటు పాకిస్థాన్ జట్టు ప్రదర్శన కూడా దారుణంగా ఉంది. విదేశాల్లో ఆడిన గత 10 మ్యాచ్‌ల్లో పాక్ 9 ఓడిపోయింది. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పాక్ కేవలం 110 పరుగులకే కుప్పకూలింది. పేలవ ఫామ్ కారణంగా 2023 చివర్లో కెప్టెన్సీ కోల్పోయిన బాబర్‌ను, షాన్ మసూద్ సారథ్యంలోనూ జట్టు వైఫల్యాలు కొనసాగడంతో 2026 జులైలో తిరిగి కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

## దులీప్ ట్రోఫీలో చారిత్రక ఘట్టం.. 15 ఏళ్లకే కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ

- దులీప్ ట్రోఫీ సెమీస్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్‌గా 15 ఏళ్ల వైభవ్
- కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు గాయం కావడంతో అనూహ్యంగా బాధ్యతలు
- సీనియర్ ఆటగాళ్లు షమీ, ముఖేష్ ఉన్న జట్టుకు సారథ్యం
- భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దేందుకే వైస్ కెప్టెన్సీ అన్న సెలక్టర్లు
- భారత ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరుదైన ఘట్టంగా నమోదు



భారత దేశవాళీ క్రికెట్‌లో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. కేవలం 15 ఏళ్ల వయసున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, దులీప్ ట్రోఫీ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో ఈస్ట్ జోన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బెంగళూరు వేదికగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌లో రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడటంతో, వైస్ కెప్టెన్‌గా ఉన్న వైభవ్ ఈ అనూహ్య బాధ్యతలను స్వీకరించాడు. మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ సందర్భంగా ఈ సంఘటన చోటుచేసుకుంది. వికెట్ కీపింగ్ చేస్తున్న ఇషాన్ కిషన్ కుడి చేతి మణికట్టుకు బంతి బలంగా తాకింది. మైదానంలోనే ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ, నొప్పి తీవ్రంగా ఉండటంతో అతను మైదానాన్ని వీడాల్సి వచ్చింది. అనంతరం అతని చేతికి పెద్ద కట్టుతో డగౌట్‌లో కనిపించాడు. దీంతో ఇషాన్ స్థానంలో కుమార్ కుశాగ్ర వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టగా, కెప్టెన్సీ పగ్గాలు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చేతికి వచ్చాయి. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇంత చిన్న వయసులో ఒక సీనియర్ జట్టుకు నాయకత్వం వహించడం ఒక అరుదైన రికార్డుగా నిలిచింది. వాస్తవానికి, ఈ టోర్నీకి ముందు వైభవ్ సూర్యవంశీని వైస్ కెప్టెన్‌గా నియమించడంపై దేశవాళీ క్రికెట్ వర్గాల్లో కొంత చర్చ జరిగింది. అయితే, ఈస్ట్ జోన్ సెలక్టర్లు తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. స్వల్పకాలిక అవసరాల కోసం కాకుండా భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దేందుకే ఈ కుర్రాడికి ఈ బాధ్యతలు అప్పగించామని స్పష్టం చేశారు. 2024 ఆరంభంలోనే ఫస్ట్ క్లాస్ అరంగేట్రం చేసిన వైభవ్‌కు ఇది కేవలం పదో ఫస్ట్ క్లాస్ మ్యాచ్, రెండో దులీప్ ట్రోఫీ మ్యాచ్ మాత్రమే. అనూహ్యంగా కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినప్పటికీ, వైభవ్ ఏమాత్రం తడబడలేదు. మైదానంలో ఉన్న ఆటగాళ్లందరిలో తానే చిన్నవాడైనా, మహ్మద్ షమీ, ముఖేష్ కుమార్, అభిమన్యు ఈశ్వరన్ వంటి అంతర్జాతీయ, దేశవాళీ అనుభవజ్ఞులతో కూడిన జట్టును సమర్థంగా నడిపించాడు. లంచ్ విరామానికి సెంట్రల్ జోన్‌ను 81 పరుగులకే 3 వికెట్లు కోల్పోయేలా చేయడంలో తన వ్యూహాలను అమలు చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన బౌలర్లకు ఫీల్డింగ్ సెట్ చేస్తూ, యువ కెప్టెన్ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇషాన్ కిషన్ గాయం నుంచి ఎంత త్వరగా కోలుకున్నా, ఈ మ్యాచ్ మాత్రం భారత క్రికెట్‌లో వేగంగా ఎదుగుతున్న వైభవ్ సూర్యవంశీ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు.

## శ్రీలంకకు భారీ షాక్.. 2027 ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ హోస్టింగ్ రైట్స్ రద్దు చేసిన ఐసీసీ!



శ్రీలంక క్రికెట్ బోర్డు కి అంతర్జాతీయ క్రికెట్ మండలి (×జజ) ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరగాల్సిన తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను శ్రీలంక నుంచి తరలించడానికి ఐసీసీ సంచలన నిర్ణయం తీసుకుంది. బోర్డు నిర్వహణలో పదే పదే లంక ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, ఐసీసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే ఈ కఠిన నిర్ణయానికి ప్రధాన కారణం. దీంతో ఈ మెగా టోర్నమెంట్‌ను శ్రీలంక నుంచి మరో దేశానికి తరలించనున్నారు.

**ప్రభుత్వ జోక్యమే ముంచేసింది:**

శ్రీలంక క్రికెట్ బోర్డు పాలనా వ్యవహారాలను ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన ట్రాన్స్‌ఫార్మేషన్ కమిటీ పర్యవేక్షిస్తోంది. క్రికెట్ బోర్డులు సర్కార్ నుంచి స్వతంత్రంగా, ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల ద్వారా మాత్రమే పనిచేయాలని ఐసీసీ స్పష్టమైన నియమం విధించినప్పటికీ లంక గవర్నమెంట్ మాత్రం దాన్ని పట్టించుకోలేదు. దాంతో ఆతిథ్య హక్కులు చేజారిన విషయాన్ని కమిటీ కార్యదర్శి ప్రకాష్ షాఫ్టర్ ధృవీకరించారు. ఈ టోర్నీని ఏ దేశంలో నిర్వహించాలనేది ఐసీసీ తదుపరి బోర్డు సమావేశంలో ఫిక్స్ చేయనుంది.

**గతంలోనూ ఇలాంటి ఘటన.. లంకకు భారీ ఆర్థిక నష్టం:**

ఐసీసీ నుంచి శ్రీలంకకు ఇలాంటి షాక్ తగలడం ఇదే తొలిసారి కాదు. 2023లోనూ ప్రభుత్వ జోక్యం కారణంగా శ్రీలంక క్రికెట్‌ను సస్పెండ్ చేసిన ఐసీసీ, 2024 పురుషుల అండర్–19 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులను రద్దు చేసి దక్షిణాఫ్రికాకు బదిలీ చేసింది. ఇప్పుడు మరోసారి ప్రసిద్ధ టోర్నీని చేజార్చుకోవడంతో లంక క్రికెట్ బోర్డుకు కోట్ల రూపాయల ఆతిథ్య ఆదాయం కోల్పోవడంతో పాటు అక్కడి హోటళ్లు, పర్యాటక, వ్యాపార రంగాలు తీవ్రంగా నష్టపోనున్నాయి.

**టోర్నీలో లంక జట్టు అర్హతపై తీవ్ర అనిశ్చితి:**

ఆతిథ్య హక్కులు కోల్పోవడంతో పాటు ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రీలంక మహిళల జట్టు అసలు ఆడుతుందా లేదా అనేదానిపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం 6 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో ఆతిథ్య దేశ హోదాలో శ్రీలంకకు నేరుగా అర్హత దక్కాల్సి ఉంది. ప్రస్తుతం ఐసీసీ వన్డే/టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రీలంక 6వ స్థానంలో ఉంది. ఇప్పుడు ఆతిథ్యం మరో దేశానికి మారితే, శ్రీలంకకు టోర్నీలో స్థానం దక్కుతుందో లేదో ఐసీసీ విడుదల చేసే కొత్త అర్హత నిబంధనలపై ఆధారపడి ఉంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.